సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 27 । జూన్ । 2024



పుడమి తల్లి పరవశం

వరుణుడు కరుణించాడు. జల్లులు కురిపించాడు. దీంతో పుడమి తల్లి నీటితో తడిచింది. వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. -8లో



గంజాయి రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై కొరఢా ఝుళిపించేందుకు వంద రోజుల ప్రణాళిక చేపడుతున్నట్లు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.2/27.2

జిల్లాలో బుధవారం 27.2 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలో ఫార్మసిస్టు, ఫార్మసీ ట్రెనీ, నవభారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్‌లో సేల్స్ రెప్రెజెంటేటివ్, టీవీఎస్ ట్రైనింగ్ సర్వీసెస్ (ఆక్సిస్ బ్యాంకు)లో సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, పీజీ చేసి 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఇతర ధృవపత్రాలు,ఫోలతో జాబ్‌మేళాకు రావాలని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గండి నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బుధవారం రూ.1,11,116 విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం రాజా బృందావనం ప్యాలెస్ కు చెందిన లింగాల మల్‌రెడ్డి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళం ఇచ్చారని తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ షరీఫ్,జూనియర్ అసిస్టెంట్ రవిచంద్రారెడ్డిల చేతికి లింగాల మల్ రెడ్డి,ఆయన సతీమణి మంగమ్మ విరాళాన్ని అందజేశారన్నారు. దాతలకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసినట్లు ముకుందారెడ్డి తెలిపారు.

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బదిలీ

కడప అర్బన్: రాష్ట్రంలో పలువురు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను బుధవారం బదిలీ చేస్తూ ఆశాఖ ఉన్నతాధికారి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కడప, అనంతపురం రీజినల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న అదనపు ఎస్పీ మాసుంబాషాను రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న అదనపు ఎస్పీ నీలం పూజితను కడప, అనంతపురం జిల్లాల రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రొద్దుటూరు డీఎస్పీగా, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా గతంలో పూజిత నీలం పనిచేశారు. తర్వాత కర్నూలుకు విజిలెన్స్ అధికారిగా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి మళ్లీ కడప, అనంతపురం రీజినల్ విజిలెన్స్ అధికారిగా నియమితులయ్యారు. అలాగే కడపలోని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో డీఎస్పీగా పనిచేస్తున్న పి. నాగరాజారెడ్డిని మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు.

పది సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలదే హవా

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు బుధవారం సాయంత్రం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పరీక్షలను జిల్లావ్యాప్తంగా మే 24వ నుంచి జూన్ పదో తేదీ వరకు 16 పరీక్ష కేంద్రాలలో నిర్వహించారు. జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకనం నిర్వహించారు. 26వ తేదీ ఫలితాలను ప్రకటించారు. ఈ ఫలితాల్లో బాలికలదే పైచేయి. పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను 2566 మంది విద్యార్థులు రాయగా ఇందులో 2083 మంది పాసై 81.18 శాతం మేర ఉత్తీర్ణతను సాధించారు. బాలురకు సంబంధించి 1546 మంది పరీక్షలు రాయగా 1227 మంది పాసై 79.37 శాతం మేర ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 1020 మంది పరీక్ష రాయగా 856 మంది ఉత్తీర్ణులై 83.92 శాతం మేర ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ ఫలితాల్లో వైఎస్సార్‌జిల్లా రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు జూలై 1 వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 27వ తేదీ నుంచి జూలై 1వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫీజును హెచ్ఎంకు మాత్రమే సమర్పించాలన్నారు. ప్రతి సబ్జెక్టు జవాబు స్క్రిప్ట్ రీకౌంటింగ్ కోసం దరఖాస్తు రుసుం రూ. 500 చెల్లించాలన్నారు. రీ వెరిఫికేషన్ కోసం రూ. 1000 చెల్లించాలని డీఈఓ తెలిపారు.

రైతు కష్టానికి మద్దతేనా!

- వరికి క్వింటాకు రూ.117 పెంపుదల
- కేంద్రప్రభుత్వ నిర్ణయం
- పెరుగుతున్న సాగు ఖర్చులతో దక్కే భరోసా ఎంత?



కడప అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 14 పంటలకు కనీస మద్దతు ధర పెంచింది. ఇందులో ప్రధాన పంటలైన వరి, పత్తి, వేరుశనగ, నూనెగింజ పంటలైన పొద్దుతిరుగుడు, నువ్వులు, మిల్లెట్స్ రకాలైన జొన్న, మొక్కజొన్న, పెసలు, కంది, మినుములు తదితర పంటలు ఉన్నాయి. అయితే సాగు ఖర్చులు అధికమయ్యే వరి కనీస మద్దతు ధరను క్వింటాకు రూ. 117 మాత్రమే పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గతంతో పోల్చుకుంటే ఈసారి తగ్గుదల. దీంతో మద్దతు ధరపై రైతుల్లో ఆనందం కనిపించడం లేదు. మరోవైపు సాగు ఖర్చులు ఏడాదికేడాది పెరుగుతుండటంతో మద్దతు ధర వల్ల ఏమేరకు భరోసా దుక్కుతుందోనని రైతులతోపాటు రైతు సంఘం నాయకులు పెదవి విరుస్తున్నారు.

ఏ పంటలకు ఎంతెంత మద్దతు ధర...

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు సంబంధించి వరి సాధారణ రకం క్వింటాల్‌కు రూ. 2300 ఉండగా గ్రేడ్–ఏ రకానికి 2320, జొన్న (హైబ్రీడ్) రూ.3371 జొన్న (మాల్దండి) రూ. 3416, సజ్జలు రూ. 2625, రాగులు రూ. 4290, మొక్కజొన్న రూ. 2225, వేరుశనగ రూ. 6785, పొద్దుతిరుగుడు విత్తనాలు రూ. 7280, నువ్వులు రూ.9267, సోయాబీన్ రూ.4892, పెసలు రూ. 8682, పత్తి (మధ్యరకం) రూ. 7121, పత్తి (లాంగ్ స్టెపెల్) రూ. 7521, కంది రూ. 7550, మినుము రూ. 7400లకు పెంచారు.

- కేంద్ర ప్రభుత్వం ఏటా మద్దతు ధర ప్రకటిస్తూనే ఉంది. 2018–19 నుంచి ఇప్పటి వరకు ఏడాదికేడాది వరిధాన్యంపై సరాసరి రూ. 100 మాత్రమే పెంచుకుంటూ వస్తోంది. మరోవైపు సాగు ఖర్చులు మాత్రం ఏటా పెరుగుతూ వస్తున్నాయి. గతంలో రూ. 1300 ఉండే కాంప్లెక్స్ ఎరువుల బస్తా ఇప్పుడు రూ. 1900 చేరింది. దీనికి తోడు డీజిల్ ధర పెరగడంతో ట్రాక్టరు యజమానులు సైతం సేద్యం ధరలను పెంచేశారు. అలాగే కూలీలు, ఎరువులు, పురుగుమందులు ఇలా అన్ని రకాల ధరలు కూడా భారీగా పెరిగాయి. సాగు ఖర్చులు గతం కంటే రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు ఖర్చు అవుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వరికి పెంచిన మద్దత ధర అంత సంతృప్తికరంగా లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా మద్దతు ధరను పెంచాలని పలువురు రైతులు కోరుతున్నారు.

2018 నుంచి వరికి కనీస మద్దతు ధర వివరాలు (క్వింటాల్‌కు)...

సంవత్సరం	సాధారణ రకం	ఏ గ్రేడు
2018–19	1750	1770
2019–20	1815	1835
2020–21	1865	1888
2021–22	1940	1960
2022–23	2020	2060
2023–24	2183	2203
2024–25	2300	2320

గతేడాది, ఈ సంవత్సరం పెరిగిన ధరల వివరాలు

పంట	2023-24	2024-25	పెరిగిన ధర
వరి సాధారణ	2183	2300	117
వరి ఏ గ్రేడ్	2203	2320	117
జొన్న హైబ్రీడ్	3180	3371	191
జొన్న (మల్దాని)	3225	3416	191
సజ్జలు	2500	2625	125
రాగులు	3846	4290	444
మొక్కజొన్న	2090	2225	135
కందులు	7000	7550	550
పెసలు	8558	8682	124
మినుము	6950	7400	450
వేరుశనగ	6377	6783	406
పొద్దుతిరుగుడు	6760	7280	520
సోయాబీన్	4600	4892	292
నువ్వులు	8635	9267	632
పత్తి	6620	7121	501
మేలు రకం పత్తి	7020	7521	501

సాగు ఖర్చులకు అనుగుణంగా ధరలు పెంచాలి



ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కేంద్రం పెంచిన ధరలు రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా లేవు. సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర పెంచితే బాగుంటుంది. కేంద్రం ఈ విషయంలో పునరాలోచించాలి. – గోపాల కృష్ణయ్య, రైతు, కృష్ణాపురం, సీకేదిన్నె మండలం

మద్దతు ధరలపై గ్యారెంటీ చట్టం తేవాలి



స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను పెంచలేదు. వరికి క్వింటాల్‌కు కేవలం 117 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. వరికి క్వింటాల్ ఉత్పత్తికి రూ. 2 వేలు వరకు ఖర్చు అవుతుంది, ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 3 వేలు వరకు మద్దతు పెంచాల్సి ఉంది. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, మినుములు ఇలా అన్నింటికి మద్దతు ధరను రూ. 5 వందల లోపు పెంచారు. అన్ని రకాల ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయాయి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని పెంచిన ధరలను పునః పరిశీలన చేసి ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలను ప్రకటించాలి. దీంతోపాటు మద్దతు ధరలపై గ్యారెంటీ చట్టం తేవాలి. – బి. దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నేటి నుంచి కేవీకేలో శిక్షణ

కడప అగ్రికల్చర్: స్కిల్ ఇండియా ప్రోగ్రాం ద్వారా వానపాముల ఎరువు తయారీపై ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు వాన పాముల ఎరువు ఉత్పత్తిదారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. కేవీకే జరిగే శిక్షణకు హాజరయ్యేవారు 5వ తరగతి చదివి ఉండాలని,, వానపాముల ఎరువు తయారీపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు 8096888039 నంబర్‌కు ఫోన్ చేసి పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు.

1 నుంచి స్టాప్ డయేరియా క్యాంపెయిన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

కడప రూరల్: స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జూలై 1 నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ కలుషితమైన ఆహారం ,నీరు తీసుకోవడం వల్ల డయేరియా వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే నీళ్ల విరోచనాలతో మనిషి నీరసించిపోతాడన్నారు. వైద్య సిబ్బంది తమ ఆసుపత్రుల పరిధిలో డయేరియాపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి తాగునీటి సరఫరాకు సంబంధించి కలుషిత నీరు రాకుండా క్లోరినేషన్ చేయించాలన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. డీఎల్‌టీఓ డాక్టర్ రవిబాబు, వైద్యాధికారులు రమేష్ రెడ్డి, డిప్యూటీ డెమో రమణమ్మ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫస్ట్ ఇయర్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫస్ట్ ఇయర్ పరీక్ష ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం సాయంత్రం విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా 5740 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వీరిలో 2117 మంది పాసై 37 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఫలితాల పరంగా రాష్ట్రస్థాయిలో వైఎస్సార్‌జిల్లా 21వ స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.



పరీక్ష రాసిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు

కేటగిరీ	కళాశాలలు	పరీక్ష రాసినవారు	ఉత్తీర్ణులైన వారు	శాతం
గవర్నమెంట్	20	967	337	35
ఎయిడెడ్	05	173	58	34
హైస్కూల్‌ప్లస్	10	121	28	23
మోడల్	03	59	36	61
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	11	171	110	64
కేజీబీవీ	17	135	55	41
కార్పొరేట్	01	38	06	16
ప్రైవేటు	85	4076	1487	36

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డీఆర్వో గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌పై డీఆర్వో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాన్ని (లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్) జిల్లాలో జులై 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మొత్తం 15 రోజులు నిర్వహించనున్నామని తెలిపారు. కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం ద్వారా ఆశా, వలంటీర్, సచివాలయ ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని పరీక్షించి ఎవరికైనా శరీరంపై రంగు మారిన మచ్చలు, చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులు, వీపుపై నొప్పి లేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పలు రాలిపోవడం, కనురెప్పలు మూతపడకపోవడం,ముక్కు దిబ్బడ ముక్కులో నుండి రక్తం కారడం, తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, చేతి వేళ్లు కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు ఉంటే వాటిని కుష్టువ్యాధి అనుమానిత లక్షణంగా గుర్తించి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేస్తామన్నారు. అంతకుముందు డీఆర్ఓ గంగాధర్ గౌడ్ లెప్రసీ క్యాంపెయిన్ పోస్టర్ ను డిస్ట్రిక్ కోఆర్డినేటింగ్ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి (అడిషనల్ డీఎంహెచ్ఓ) డాక్టర్ రవిబాబు, జిల్లా విద్యా అధికారి అనురాధ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శ్రీలక్ష్మి, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, మెప్మా పీడీ సురేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్ర శేఖర్, డీపీఎంఓ డాక్టర్ శశి భూషణ్ రెడ్డి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్,జిల్లా ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ వీవీ మనోహర్, ఆర్‌బీఎస్‌కే మనోరమ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కబ్జా కోరల్లో వక్ఫ్ ఆస్తులు

- కోట్ల విలువైన భూములు పరుల పాలు
- కోర్టుల్లో ఏళ్లుగా కేసులు
- అచేతనావస్థలో జిల్లాస్థాయి కమిటీ



పెద్దముడియం మండలంలో ఆక్రమణలో ఉన్న వక్ఫ్ భూమి

రెవెన్యూ డివిజన్	మండలాలు	వక్ఫ్ సంస్థలు	ఎకరాలు
జమ్మలమడుగు	14	98	804.09
కడప	17	108	786.01
రాజంపేట	16	71	370.17
మొత్తం	47	277	1960.27

కడప సెవెన్‌రోడ్స్: కోట్లాది రూపాయల విలువ జేసే వక్ఫ్ ఆస్తులు అనేక ఏళ్లుగా కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. అధికారుల సహకారంతో దర్జాగా కబ్జాల పర్వం సాగిపోతోంది. ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశాన్ని అధికారులే కల్పిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దశాబ్దాలుగాన్యాయ స్థానాల్లో కేసులు అలా సాగుతూనే ఉన్నాయి. ఫలితంగా భారీ ఎత్తున వక్ఫ్ ఆదాయానికి గండి పడుతోంది. ఆస్తులన్నీ కాపాడాల్సిన కలెక్టర్ అధ్యక్షతన ఉన్న జిల్లా స్థాయి ఇంటర్ డిపార్టుమెంటల్ కమిటీ అచేతనంగా ఉంది.

అచేతనంగా జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ

ఒకప్పుడు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీలు ఉండేవి. అయితే అవి సక్రమంగా పనిచేయలేదని 2014లో జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు 2014 అక్టోబర్ 13న జీఓఎంఎస్ నంబరు 18 జారీ చేశారు. తర్వాత జిల్లా స్థాయి ఇంటర్ డిపార్టుమెంటల్ కమిటీలు ఏర్పాటు చేసి గత సంవత్సరం జూన్ 17న ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబరు 60 జారీ చేసింది. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఎస్పీ, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌అండ్‌బీ ఈఈ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.ఈ కమిటీ సంబంధిత శాఖలను సమన్వయ పరిచి వక్ఫ్ ఆస్తులను కబ్జాల నుంచి స్వాధీన పరుచుకోవాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం జరగాలి. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రతిపాదనల మేరకు వక్ఫ్ ఆస్తుల రికవరీకి తీసుకున్న చర్యలను సమీక్షించాలి. ఆక్రమణలు పునరావృతం కాకుండా చూడాలి. ఖాళీగా ఉన్న వక్ఫ్ భూములకు రక్షణ కల్పించాలి. రీ సర్వే నిర్వహించి వక్ఫ్ భూములకు సరిహద్దులు నిర్ణయించాలి. కొత్తగా ఏర్పడిన మసీదులు, గ్రేవ్ యార్డ్స్, దర్గాలు, పీర్ల చావిడిలను పర్యవేక్షించాలి. వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా వక్ఫ్ స్థలాల్లో ఎవరైనా నిర్మాణాలు చేపడితే అందుకు ఆమోదం తెలుపరాదంటూ పంచాయతీ సెక్రటరీలు, వార్డు సచివాలయాల్లోని ప్లానింగ్ విభాగాలకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో తీసుకున్న చర్యలపై మైనార్టీ సంక్షేమశాఖ కమిషనర్‌కు నివేదికను పంపాల్సి ఉంటుంది. వక్ఫ్ ఆస్తులపై వ్యక్తుల పేరిట జారీ చేసిన అక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేయించి సంబంధిత వక్ఫ్ సంస్థల పేరిట పునరుద్ధరింపజేయాలి. ఇందుకోసం ఇనామ్ అబాలిషన్ యాక్టులోని ప్రొవిజన్స్ అమలు చేయాలి. అలాగే కబ్జాదారులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టాలి. ఆక్రమణల తొలగింపు, కేసుల నమోదులో పోలీసులు సహకరించాల్సి ఉంటుంది. వక్ఫ్ ఆస్తులు రిజిస్ట్రేషన్లు జరగకుండా వాటిని పీఓబీ జాబితాలో చేర్చి జిల్లా రెవెన్యూ అధికారి ఆ వివరాలను జిల్లా రిజిస్ట్రార్‌కు పంపాల్సి ఉంటుంది. జాయింట్ కలెక్టర్ వక్ఫ్ సంస్థల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించడంతోపాటు రెవెన్యూ కోర్టుల్లో ఉన్న వక్ఫ్ కేసులను మానిటర్ చేస్తుండాలి. వక్ఫ్ బోర్డు నుంచి ఎన్ఓసీలు లేకుండా వక్ఫ్ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు ఎవరూ భవన నిర్మాణాలు చేపట్టకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్, డీపీఓలపై ఉంటుంది. జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం 2015 మే 4వ తేదీ ఒక్కసారి మాత్రమే నిర్వహించారు. తర్వాత ఇంతవరకు కమిటీ సమావేశం నిర్వహించలేదంటే వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పట్ల అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో అర్థమవుతోంది.


ఆక్రమణల పర్వం

స్థానిక అధికారుల కుమ్మక్కు వల్లే వక్ఫ్ ఆస్తులు పరులపాలవుతున్నాయి. వక్ఫ్ భూములపై అక్యుపెన్సీ రైట్ సర్టిఫికెట్లు, పట్టాదారు పాసు పుస్తకాలు కూడా జారీ చేశారు. పీఓబీలో ఉన్నప్పటికీ గతంలో చాలా భూములకు రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రమైన కడప నగరంలో స్థలాలకు విపరీతమైన విలువ ఉంది. దీంతో ఆక్రమణదారుల కన్ను వీటిపై పడింది. పలుకుబడి కలిగి వ్యక్తుల చేతుల్లోకి క్రమంగా ఈ స్థలాలు వెళ్లిపోతున్నాయి. రెవెన్యూ, పోలీసుల సహకారంతో వీటిని తిరిగి స్వాధీన పరుచుకోవాల్సిన అధికారులు గతంలో నోటీసులు జారీ చేయడం ద్వారా న్యాయ స్థానాలను ఆశ్రయించే అవకాశాన్ని ఆక్రమణదారులకు కల్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. కడపలోని బుర్హనుద్దీన్ షా దర్గా, అక్బరుల్లాషా దర్గా, రోషన్ మున్వర్‌మసీదులకు సంబంధించిన కేసులు ఏళ్ల తరబడి తెగడం లేదని తెలుస్తోంది. వల్లూరు మండలం గోటూరు గ్రామ పొలం సర్వే నంబరు 357లో వక్ఫ్ భూమి 8.20 ఎకరాలు ఉంది. కడప–తాడిపత్రి ప్రధాన రహదారి అనుకుని ఉండడంతో ఎకరా రూ. కోటి విలువ జేస్తుందని అంటున్నారు. ఆక్రమణదారులు ఈ భూముల్లో ప్లాట్లు వేసి సొమ్ము చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భూములకు సంబంధించిన వాజ్యం సుప్రీం కోర్టులో నడుస్తోంది. ఇలా జిల్లాలో సుమారు 60 శాతం ఆస్తులు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు అంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ప్రస్తుతం వక్ఫ్ బోర్డుకు వార్షిక ఆదాయం రూ. 17,71,954 మాత్రమే వస్తోంది. ఆక్రమణలు తొలగించగలిగితే ఆదాయం మరింత పెరుగుతుందని అధికారులు అంటున్నారు.

ఆస్తుల వివరాలు

జిల్లాలోని దర్గాలు, మసీదులు, పీర్ల చావిడులకు పూర్వం దాతలు తమ విలువైన వ్యవసాయ భూములు, స్థలాలు దానంగా ఇచ్చారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంలో ఏడు శాతం వక్ఫ్‌బోర్డుకు చెల్లించి మిగతా మొత్తాన్ని ముతవల్లీలు తమ ప్రార్థనా మందిరాల నిర్వహణకు వినియోగించాలి. ఉమ్మడి కడపజిల్లాలోని లక్కిరెడ్డిపల్లె, ముద్దనూరు, వేముల, పుల్లంపేట మండలాలు మినహాయిస్తే మిగిలిన 47 మండలాల్లో 277 వక్ఫ్ సంస్థలకు 1960.27 ఎకరాల భూమి ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు పేర్కొంటున్నాయి. వక్ఫ్ భూములు అధికంగా పెద్దముడియం మండలంలో 232.50 ఎకరాలు, పెండ్లిమర్రిలో 176.18 ఎకరాలు, పోరుమామిళ్లలో 92.97 ఎకరాలు ఉన్నాయి.

కమిటీ సమావేశం ఏర్పాటుకు యత్నం



జిల్లాలో వక్ఫ్ ఆస్తులు ఎక్కడెక్కడ కబ్జాలకు గురయ్యాయో తహసీల్దార్ల ద్వారా తెలుసుకోవాల్సి ఉంది. జిల్లా విభజన జరగడంతో రికార్డుల విభజన కూడా జరగాల్సి ఉంది. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం జిల్లా స్థాయి ఇంటర్ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం . కలెక్టర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. – గౌస్‌బాషా, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, కడప

క్లుప్తంగా

కారు దగ్ధం..

– రూ. 14 లక్షల ఆస్తి నష్టం

కడప అర్బన్ : కడప నగరంలోని అరవింద్ నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.14 లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. కాలనీలో నివాసముంటున్న హరికుమార్ తన కారును ఇంటి ఎదుట ఉంచారు. ఇంజిన్‌లో మంటలు రేగడంతో గుర్తించేలోగానే ఇంట్లోకి వ్యాపించాయి. దీంతో కారుతోపాటు ఇంటిలో సామగ్రి కొంత కాలిపోయింది. కడప ఫైర్ స్టేషన్ సిబ్బంది చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ. 14 లక్షల మేరకు నష్టం జరిగినట్లు కడప అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

దేవాలయ భూముల్లో దౌర్జన్యంగా సేద్యం

ముద్దనూరు : మండలంలోని పెద్ద దుద్యాల వరదరాజస్వామి ఆలయ భూముల్లో కొందరు టీడీపీ మద్దతుదారులు బుధవారం దౌర్జన్యంగా దుక్కులు ప్రారంభించారు. గతంలో ఈ భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలంపాట నిర్వహించారు. కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు వేలంపాడి భూములు దక్కించుకున్నారు. అయితే తాను వేలంలో దక్కించుకున్న భూముల్లో అదే గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు అక్రమంగా దుక్కులు చేపట్టారని రైతు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఈ విషయాన్ని మండల ఇన్‌ఛార్జి దేవాదాయశాఖ ఈవో రామచంద్రాచారికి ఫిర్యాదు చేయగా, వేలం పాడిన వారికే హక్కు ఉందని, ఇతరులకు లేదని స్పష్టం చేశారని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

పులివెందుల రూరల్ : పులివెందుల–అంబకపల్లె రహదారిలో వస్తున్న కారు.. పులివెందుల నుంచి వస్తున్న ఉపాధ్యాయుడు బాషా బైక్ అంబకపల్లె రహదారి వద్ద కారు–బైక్ పరస్పరం ఢీకొన్నాయి. బాషాకు తీవ్రగాయాలవడంతో స్థానికులు చికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పుడమి తల్లి పరవశం



పచ్చదనంతో నిండిన పుడమి

వరుణుడు కరుణించి జల్లులు కురిపించడంతో పుడమి తడిచింది. వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు మొదలయ్యాయి. ఈ ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో వరి రైతులు నిమగ్నమయ్యారు. భూమిని చదును చేసి ఇప్పటికే వరి నారు సిద్ధం చేసుకోగా.. మరి కొందరు భూమిని కలియ దున్నుతూ పొలాలను సిద్ధం చేసుకునే పనుల్లో మునిగిపోయారు. ఇంకొందరు ఇప్పటికే సాగు చేయడంతో పంటలు పచ్చదనం నిండి కనిపిస్తున్నాయి. పంటల సాగులో యాంత్రీకరణ పెరడంతో ట్రాక్టర్లతో ముందస్తు సేద్యం ఆరంభించారు. దీంతో ఎటు చూసినా నీటితో నిండిన పంట పొలాలు, భూములను దున్నుతున్న రైతులే దర్శనమిస్తున్నారు. జూన్ నెలలో భారీ వర్షాలు కురవడంతో దుక్కి పనులపై దృష్టి సారించారు. సిద్ధవటం మండలం టక్కోలులో దృశ్యాలివీ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



వరి నారు సిద్ధం



పొలంలో కలియదున్నుతూ



నాట్లు వేసేందుకు సిద్ధం

రైతు సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఆందోళన

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల తహశీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళన చేపడుతున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లోనే రైతుకు రూ.20 వేల సాయం అందించాలన్నారు. ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా వడ్డీ లేకుండా రూ.3లక్షల వరకు, పావలా వడ్డీతో రూ.5లక్షల వరకు రుణం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట కాల్వల మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించాలని కోరారు. గత రబీలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలు చెల్లించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్ట, వరి, వేరుశనగ, కంది విత్తనాలను 90శాతం రాయితీతో ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. ఎద్దులు, బండ్లు, నాగలి తదితర సామగ్రి, ట్రాక్టర్ల కొనుగోలుకు 50 శాతం రాయితీ అందించాలన్నారు. కల్తీ విత్తనాలతో మోసపోతున్న రైతులను ఆదుకోవాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మరణించిన రైతు కుటుంబాలకు రూ.15లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని, నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.75 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. రైతు, కౌలు రైతుల పంట రుణాలు రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు.

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత



అస్వస్థతకు గురై పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



హాస్టల్‌లో తయారైన ఇడ్లీలను పరిశీలిస్తున్న ఆర్డీవో, సీఐ

ముద్దనూరు : వైఎస్సార్ జిల్లా ముద్దనూరులోని బాలురోన్నత పాఠశాల సమీపంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం విద్యార్థులు కలుషితాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. అల్పాహారంలో భాగంగా సగం ఉడికిన ఇడ్లీ, సాంబారు తినడం వల్లే ఈ సంఘటన జరిగినట్లు సమాచారం. బాధిత విద్యార్థుల సమాచారం మేరకు.. స్థానిక ఎస్సీ వసతి గృహంలో 24 మంది విద్యార్థులు ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, సాంబారు తిన్నారు. కొద్దిసేపటికే హాస్టల్ ఆవరణలోనే ఏడుగురు విద్యార్థులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడ పరీక్షలు జరిపారు. వీరిలో యశ్వంత్, బన్నీలకు సెలైన్ ఎక్కించారు. మరో ఇద్దరిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యం అందించారు. చికిత్స అనంతరం ఇద్దరు కోలుకున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే ఆర్డీవో శ్రీనివాసులు, డీడీ సరస్వతి, సీఐ దస్తగిరి వసతిగృహానికి చేరుకుని వంటలను పరిశీలించి విచారణ చేపట్టారు.

విద్యుత్తు షాక్‌తో గేదె మృతి

పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో బుధవారం విద్యుత్తు షాక్‌తో ఓ గేదె మృతి చెందినట్లు యజమాని గొంగటి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. గ్రామంలో విద్యుత్తు నియంత్రిక అర్త్ తీగను గేదె తాకడంతో మృతి చెందినట్లు తెలిపారు. మరణించిన గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు.

హిట్ అండ్ రన్ కేసులపై అప్రమత్తం

– జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : హిట్ అండ్ రన్ ప్రమాదాల కేసులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక న్యాయసేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులు, ఫస్ట్ యాక్సిడెంట్ రిపోర్ట్, జిల్లా స్థాయి కమిటీ పనితీరు, పరిహారం ప్రక్రియ, బాధితులకు పరిహారం తదితర అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ జిల్లా స్థాయి మానిటరింగ్ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ రవికుమార్, రాయచోటి సీసీఎస్ డీఎస్పీ పి.శ్రీధర్, మదనపల్లి ఆర్టీఓ హరి ప్రసాద్, కడప స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.రవీంద్ర, ట్రాఫిక్ సీఐ వి.సీతారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా ముద్దనూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి కారణమైన హాస్టల్ వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. పీఎస్‌యూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాసిరకమైన ఇడ్లీరవ్వ పెట్టడంతో అస్వస్థతకు గురయ్యారన్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

వ్యక్తి దుర్మరణం

తలుపుల : చికెన్ కొనుగోలు చేసేందుకు వెళుతుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వైఎస్సార్ జిల్లా ఖాజీపేటలో నివాసముంటున్న ఎం.రమణ (45) తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం స్వగ్రామమైన తలుపుల మండలం వేమలగొందికి వచ్చాడు. కుటుంబ సభ్యులను తన చెల్లెలు ఇంట్లో దింపిన అనంతరం చికెన్ తీసుకొస్తానని తెలిపి ద్విచక్ర వాహనంపై పెద్దన్నవారిపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వేగ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఏఐటీఎస్‌కు జాతీయ స్థాయి ర్యాంకు



అన్నమాచార్య యూనివర్సిటీ

రాజంపేట : ఏఐటీఎస్(అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల)కు జాతీయ స్థాయి ర్యాంకు దక్కింది. కళాశాల ప్రిన్సిపల్ నారాయణ, అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థుల కృషితో ర్యాంకు సాధించగలిగామని తెలిపారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో అద్భుతాలకు ఏఐటీఎస్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కళాశాల మౌలిక సదుపాయాలు, నాణ్యత, పరిశోధన ఫలితాలు, ప్లేస్‌మెంట్ రికార్డులు, తల్లిదండ్రుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఇండియాలో ప్రసిద్ధిగాంచిన ది వీక్ మ్యాగ్‌జైన్ జాతీయ స్థాయిలో ర్యాంకులు ప్రకటించగా ఏఐటీఎస్‌కు ఎనిమిదో ర్యాంకు దక్కింది. దీంతోపాటు సౌత్‌జోన్ కళాశాలలో 51వ ర్యాంక్, అఖిల భారత ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో 109 ర్యాంకును కైవసం చేసుకుంది. జాతీయ కళాశాల స్థాయి ర్యాంకు రావడంపై ఏయూ రిజిస్ట్రార్ మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు.

మట్టి తరలింపు వాహనాల సీజ్

వేముల : మండలంలోని గొల్లలగూడూరు సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పనులకు మట్టి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో మైనింగ్ అధికారి వై.రా ధ, మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టి తవ్వుతుండడంతో ఒక ఇటాచీ వాహనంతోపాటు, తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను స్వాధీనం చేసుకుని వేముల ఎస్సై ధనుంజయుడుకు అప్పగించారు.

మద్యం దుకాణంలో చోరీ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టూటౌన్ బైపాస్ రోడ్డులోని సంజీవ నగర్ ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. సుమారు రూ.20 వేలు విలువ చేసే మద్యం సీసాలు చోరీకి గురైనట్లు ఎక్సైజ్ సీఐ సుహాసిని బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం తెలిపారు. దుకాణంలో పెద్ద మొత్తంలో నగదు కూడా చోరీకి గురైనట్లు తెలుస్తోంది.

యువతి ఆత్మహత్య



భానుశ్రీ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో నివాసం వుంటున్న కొట్టిపాటి భానుశ్రీ(21) ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని మృతి చెందారు. మృతురాలి అక్క కనిష్క, తల్లి లక్ష్మీదేవిల ఫిర్యాదు మేరకు.. చిన్నచౌక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నగరానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ కేశవయ్య 2009లో మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందాడు. అతని మరణానంతరం భార్య లక్ష్మీదేవికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం ఇచ్చారు. లక్ష్మీదేవి ప్రస్తుతం కడప బాలుర జూనియర్ కళాశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్మీదేవికి, కేశవయ్యకు కనిష్క (24), భానుశ్రీ(21) ఇద్దరు కుమార్తెలు. కనిష్క కో– ఆపరేటివ్ కాలనీలోని సిటీ కేర్ హాస్పిటల్‌లో పనిచేస్తోంది. భానుశ్రీ కడప నగర శివార్లలోని బుడ్డాయపల్లి కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. బుధవారం ఉదయం ఓ ఫంక్షన్‌కు వెళ్లే విషయంలో అక్కాచెల్లెళ్లు గొడవపడ్డారు. తల్లి భానుశ్రీని మందలించింది. దీంతో తల్లి, అక్క విధులకు వెళ్లిన తరువాత భానుశ్రీ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం విధులనుంచి వారు రాగానే గమనించారు. స్థానికుల సహకారంతో భానుశ్రీ చనిపోయిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని చిన్నచౌక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

కోటంక క్షేత్రంలో చోరీ కేసు ఛేదింపు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- 16.261 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వెండి సామగ్రిని పరిశీలిస్తున్న డీఎస్పీ శివారెడ్డి

అనంతపురం : గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రంలో చోటు చేసుకున్న చోరీ కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. నలుగురు సభ్యులుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిందితుల వివరాలను రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి వెల్లడించారు.

చోరీ చేశారిలా...

ప్రసిద్ధ కోటంక కొండలోని గుంటి సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఈ నెల 20న అర్ధరాత్రి దుండగులు చొరబడి 16కిలో వెండి ఆభరణాలు, 8 తులాల బంగారు ఆభరణాలు , రెండు హుండీలను పగులగొట్టి రూ.15 వేలు నగదు అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి 7.30 గంటలు పూజాధికాలు ముగించుకున్న తర్వాత ఆలయానికి తాళం వేసి అర్చకులు ఇళ్లకు వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు నాలుగు హుండీల్లో రెండు పగులగొట్టి భక్తులు సమర్పించిన నగదు, కానుకలతో పాటు గర్భగుడికి కన్నం వేసి బీరువాలోని వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయ కమిటీ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఈఓ బాబు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. స్నిఫ్ఫర్ డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు.

స్వాధీనం చేసుకున్నవి ఇవే...

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల విరాట్‌కు అలంకరించే రూ.13 లక్షల విలువైన 16.261 కిలోల వెండి ఆభరణాలు, అమ్మవార్ల మెడలో అలంకరించే నాలుగు బంగారు తాళిబొట్లు, రూ.2,500 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, కట్టర్, కటింగ్ ప్లేయర్, క్యాటర్ బాల్, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు.

కేవలం ఐదు రోజుల్లోనే...

ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి నేతృత్వంలో శింగనమల సీఐ శ్రీధర్, సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. క్లూస్‌టీం సేకరించిన వేలిముద్రల ఆధారంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు ఎవరైంది ఇట్టే పసిగట్టేశారు. గుడి పరిసరాల్లో వినియోగించిన ఫోన్ నెంబర్లు, కాల్ డేటా తదితర అంశాల ఆధారంగా కేవలం ఐదు రోజుల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడైన సి.పవన్‌కుమార్ కర్ణాటకలోని కోలారు, కొరటగేరి, పట్టణాయక్ హళ్లి, వైఎస్సార్ జిల్లా లింగాల, సిద్దవటం పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు ఆలయాల్లో జరిగిన చోరీల్లో కీలక నిందితుడిగా గుర్తించారు. అలాగే అవుల రాముపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసు ఉంది. ఐదు రోజుల్లో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐలు శ్రీధర్, ఇస్మాయిల్, ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్, సిబ్బంది ఎం.దివాకర్, ప్రసాద్, దేవ్లా నాయక్, చంద్రశేఖర్, శ్రీధర్ పాణి, మల్లికార్జున, శ్రీనివాసులు, రంజిత్‌కుమార్, బాలకృష్ణను ఎస్పీ గౌతమిశాలి ప్రత్యేకంగా అభినందించారు.

పట్టుబడింది వీరే...

పేరు	ఊరు	మండలం	జిల్లా
సి.పవన్‌కుమార్	తురకలపట్నం	రొద్దం	శ్రీసత్యసాయి జిల్లా
అవుల రాము	ఎంఎంఎస్ తండా	సీకేదిన్నె	వైఎస్సార్ జిల్లా
వెంకటరమణ	కొత్తమదరమ్	ఒంటిమిట్ట	వైఎస్సార్ జిల్లా
ఈ.శ్రీనివాసులు	బాలకృష్ణనగర్	కడప	వైఎస్సార్ జిల్లా

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిఘా
- వంద రోజుల ప్రణాళికతో అక్రమాలకు అడ్డుకట్ట
- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

కడప అర్బన్ : జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై కొరఢా ఝుళిపించేందుకు వంద రోజుల ప్రణాళిక చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు బృందాలతో గంజాయి రవాణాపై నిఘా పెట్టామన్నారు. నేరాలకు పాల్పడకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పదే పదే గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాల తనిఖీ నిర్వహిస్తామని, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేపడతామని తెలిపారు. మాదక ద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై కళాశాలలు, విద్యా సంస్థల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయిపై ఎలాంటి సమాచారమైనా 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు చెప్పవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ సూచించారు. గంజాయి తీసుకునే వారి వివరాలు తెలిపితే.. రిమ్స్ వైద్యశాలలోని డీ–అడిక్షన్ కేంద్రానికి తరలించి సాధారణ వ్యక్తుల్లా మార్చేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోందన్నారు.

విద్యార్థుల ర్యాలీ

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ ఆధ్వర్యంలో కడప డీఎస్పీ ఎండీ.షరీఫ్ పర్యవేక్షణలో విద్యార్థులతో కలిసి కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి సంధ్య సర్కిల్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కోటిరెడ్డి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఈబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కడపలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో విద్యార్థులు, ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.